

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LLB
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 02 డిసెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 100 పేజీలు : 4 వెల : రూ 3-00


# వరద ప్రభావిత జిల్లాల్లో సీఎం జగన్ పర్యటన



విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతకొన్ని రోజులుగా భారీ వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వరద ధాటికి ముఖ్యంగా దక్షిణాంధ్ర, రాయలసీమ అల్లాడిపోయింది. వరద ప్రభావంతో అతలా కుతలమైన మూడు జిల్లాల్లో ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 2,3 తేదీల్లో జగన్ తన సొంత జిల్లా కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో పర్యటించి.. వరద బాధితులను పరామర్శించనున్నారు. ఇప్పటికే సీఎం జగన్ వరద ప్రభావిత జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు ఆయన మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌కు పర్యటన షెడ్యూల్ విడుదలైంది.రెండో తేదీన గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి బయలదేరి గన్నవరం విమానాశ్రయం నుంచి కడప చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్ లో రాజంపేట మండలం మదనపల్లి చేరుకుంటారు. పులపాతూరు గ్రామంలో సీఎం పర్యటిస్తారు. భారీగా దెబ్బ తిన్న గ్రామాన్ని సందర్శించి..బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడనున్నారు. సహాయ శిబిరాలను సందర్శించి..గ్రామ సచివాలయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి మందపల్లి గ్రామానికి వెళ్లనున్నారు. ఆ తరువాత వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య డాం ప్రాంతాన్ని సీఎం స్వయంగా పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ముఖ్యమంత్రి రేణిగుంట విమానశ్రయానికి చేరుకుంటారు. 3.40కు రోడ్డుమార్గాన బయలుదేరి 3.55 గంటలకు రేణిగుంట మండలంలోని వేదాలచెరువు ఎస్టీ కాలనీకి చేరుకుని కాలనీవాసులతో మాట్లాడతారు. సాయంత్రం 4.30కు బయలుదేరి 4.40 గంటలకు ఏర్పేడు మండలంలోని పాపానాయుడు పేటకు చేరుకుని వరద నష్టాలను పరిశీలిస్తారు. 4.55కు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు తిరుచానూరు?పాడిపేట క్రాస్‌కు చేరుకుని బాధితులతో మాట్లాడతారు. 5.40 గంటలకు తిరుపతిలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకుని 7 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులతో వరదలపై సమీక్షిస్తారు. ఆరోజు అక్కడే బసచేస్తారు. 3వ తేదీ ఉదయం 8.30కు పద్మావతి అతిథి గృహం నుంచి బయలుదేరి 8.40 గంటలకు తిరుపతిలోని కృష్ణానగర్‌కు చేరుకుని బాధితులతో మాట్లాడుతారు. 9.25 గంటలకు బయలుదేరి ఆటోనగర్‌కు చేరుకుని బాధితుల సమస్యలు తెలుసుకుంటారు. 10.20 బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, 10.30కి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు పయనమవుతారు.

## ఆ ప్రచారాన్ని సీరియస్‌గా తీసుకోవాలి: సీఎం జగన్



అమరావతి: ఓటీఎస్‌పై జరుగుతున్న ప్రచారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో అధికారులకు సీఎం జగన్ సూచించారు. అలాగే జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం (ఓటీఎస్) పై జరుగుతున్న ప్రచారంపై కఠినంగా ఉండాలన్నారు. ఓటీఎస్ పథకం ద్వారా లక్షలమంది పేదలకు లబ్ధి జరుగుతుందన్నారు. ఈ పథకంపట్ల ప్రచారంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారుల్లో సందేహాలు, అనుమానాలు ఉంటే అధికారులు ఒకటికి రెండుసార్లు అవగాహన కల్పించాలన్నారు. పథకం ద్వారా వచ్చే లబ్ధిని, రిజిస్టర్ పత్రాల ద్వారా వారికి మాఫీ అవుతున్న అసలు, వడ్డీ వివరాలను కూడా చూపించాలన్నారు.

## తెలంగాణ నుంచి ఎక్కువ బియ్యం సేకరించాం : కేంద్రం


ఢిల్లీ : తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం సేకరణను రాష్ట్ర ప్రభుత్వాలే చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణ నుంచి ఎక్కువ బియ్యం సేకరించినట్టు కేంద్రం వెల్లడించింది. లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని నాని అడిగిన ప్రశ్నకు కేంద్రం రాతపూర్వక సమాధానమిచ్చింది. 2018-19లో ఏపీలో 48.06 లక్షల మెట్రిక్ టన్నులుండగా, తెలంగాణలో 51.90 లక్షల మెట్రిక్ టన్నులు... 2019-20లో ఏపీ నుంచి 55.33 లక్షల మెట్రిక్ టన్నులు, తెలంగాణ నుంచి 74.54 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్టు తెలిపింది. 2020-21లో ఏపీ నుంచి 56.67 లక్షల మెట్రిక్ టన్నులు, తెలంగాణ నుంచి 94.53 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్టు కేంద్రం వెల్లడించింది.



## ఇది బలవంతపు పథకం కాదు: బొత్స సత్యనారాయణ

తాడేపల్లి: పేదలందరికీ ఉచిత ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం కలిగించేందుకే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ ప్రవేశపెట్టామని మున్సిపల్, పట్టాణాభివృద్ధి శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు గృహహక్కు చేకూర్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇది బలవంతపు పథకం కాదని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారికే పథకం వర్తిస్తుందని తెలిపారు. పాదయాత్రలో వచ్చిన విజ్ఞప్తి మేరకు సీఎం జగన్ ఈ పథకం ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కాగా, దీనిపై వివాదాస్పద ఆదేశాలు ఇచ్చిన అధికారిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఒక పథకం ప్రకారం.. టీడీపీ కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందన్నారు

## రాజ్యసభ రేపటికి వాయిదా



న్యూఢిల్లీ: రాజ్యసభ వరుసగా మూడో రోజు కూడా విపక్ష సభ్యుల ఆందోళనలతో అట్టుడికింది. టీఆర్ఎస్ ఎంపీలతోపాటు ఇతర పార్టీల ఎంపీలు కూడా ధాన్యం సేకరణ, పంటలకు కనీస మద్దతు ధర, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో మరణించిన రైతులకు పరిహారం విషయమై సభలో నినాదాలు చేశారు. టీఆర్ఎస్ ఎంపీలు ఛైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టారు. ధాన్యం సేకరణపై కేంద్రం సమగ్ర విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు.విపక్షాల ఆందోళనలతో సభలో గందరగోళం నెలకొనడంతో ఛైర్మన్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా సేమ్ సీన్ రిపీట్ కావడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు, ఆ తర్వాత 3 గంటల వరకు సభ వాయిదా పడింది. మధ్యాహ్నం మూడు గంటలకు సభ తిరిగి ప్రారంభమైనా గందరగోళం కొనసాగడంతో రాజ్యసభను రేపటికి వాయిదా వేశారు.

## ప్రజాప్రతినిధుల కేసుల ఉపసంహరణపై ఏపీ హైకోర్టులో విచారణ





అమరావతి : ప్రజాప్రతినిధుల కేసుల ఉపసంహరణపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఏపీ హైకోర్టు సుమోటోగా కేసు విచారణకు స్వీకరించింది. ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, విడుదల రజని, జక్కంపూడి రాజా, అప్పారావు, మల్లాది విష్ణు, ఎంపీ మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలపై.. క్రిమినల్ కేసుల ఉపసంహరణపై సుమోటోగా కేసు విచారణ నిర్వహించింది. సుప్రీం తీర్పు మేరకు ప్రజాప్రతినిధుల కేసుల ఉపసంహరణపై విచారణ జరిపింది. హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిపోర్ట్ సమర్పించాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేసుల ఉపసంహరణకు ఎన్ని ప్రతిపాదనలు వచ్చాయో రిపోర్టు ఇవ్వాలని.. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఏపీ హైకోర్టు 24కు వాయిదా వేసింది.

## జగన్ ఆర్థిక అవకతవకల పరంపర వేగంగా ముందుకెళ్తోంది: పట్టాభి

విజయవాడ: సీఎం జగన్ ఆర్థిక అవకతవకల పరంపర నానాటికీ వేగంగా ముందుకెళ్తోందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ విమర్శించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ షెల్, సూట్ కేస్ కంపెనీలు పెట్టి మనీలాండరింగ్‌తో అర్జించిన నైపుణ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున కూడా సూట్ కేస్, షెల్ కంపెనీలు పెట్టి వాటి ద్వారా డబ్బులు కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి గవర్నర్‌తో పాటు మరికొంతమంది ఐఏఎస్‌లను షేర్ హోల్డర్లుగా పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ ఆద్వర్యంలోని అన్నిశాఖలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, సోసైటీల సొమ్మని ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పోరేషన్‌లో డిపాజిట్ చేయాలని జీవో 1998 ఇచ్చారన్నారు. దాన్ని సమర్ధించుకోవటం కోసం పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ సొమ్ము రూ. 9.60 కోట్లు, ఏపీ ఆయిల్ కోఆపరేటివ్ ఫెడరేషన్ డబ్బు రూ. 5 కోట్లు దోపిడీకి గురయ్యాయని, బ్యాంకుల్లో ఉన్నడబ్బుకి భద్రతలేదంటూ జీవో 1998 విడుదల చేశారని విమర్శించారు.



# సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నీతి ఆయోగ్ వైస్ చైర్మన్



విజయవాడ: తాడేపల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజీవ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా రెండు రోజుల పాటు ఏపీలో జరిగే వివిధ కార్యక్రమాలలో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ కుమార్, నీతి ఆయోగ్ బృందం పాల్గొననున్నారువీరపనేని గూడెంలో నీతి ఆయోగ్ బృందం పర్యటన ముగిసింది. అక్కడి నుంచి నీతి ఆయోగ్ బృందం విజయవాడకు బయల్దేరింది. వీరపనేనిగూడెం గ్రామ సచివాలయాన్ని నీతి ఆయోగ్ బృందం సందర్శించింది. గ్రామ సచివాలయం పనితీరును జిల్లా కలెక్టర్ జె.నివాస్ నీతి ఆయోగ్ బృందానికి వివరించారు. నీతి ఆయోగ్ బృందానికి సేంద్రీయ పద్ధతిలో పండించిన పంటలతో తయారు చేసిన ఆహారప దార్ధాలను వీరపనేని గూడెం గ్రామస్తులు అందజేశారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ డా.రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. వీరపనేని గూడెం గ్రామస్తులుప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వడం నిజంగా అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఇలాగే మరింత మంది ప్రకృతి వ్యవసాయం వైపు అగుడులేయాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.? వీరపనేని గూడెంలోని రైతు భరోసా కేంద్రాన్ని డా.రాజీవ్ కుమార్ నేతృత్వంలోని నీతి ఆయోగ్ బృందం సందర్శించింది. నీతి ఆయోగ్ బృందానికి వీరపనేని గూడెం గ్రామస్తులు వినూత్నంగా స్వాగతం పలికారు. సేంద్రీయ పద్ధతిలో పండించిన కూరగాయలు, చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను నీతి ఆయోగ్ బృందం సందర్శించింది. గ్రామ సచివాలయంలో ప్రకృతి వ్యవసాయం పై మహిళా సంఘాలతో సమావేశం అయ్యింది. నీతి ఆయోగ్ బృందంతో పాటు ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జె.నివాస్, జాయింట్ కలెక్టర్ శివశంకర్, సబ్ కలెక్టర్ ప్రవీణ్ చంద్ పాల్గొన్నారు.?నీతి ఆయోగ్ బృందం కృష్ణా జిల్లాలోని వీరపనేని గూడెంకు చేరుకుంది. వీరపనేని గూడెంలో బి.సతీష్ రెడ్డి అనే రైతుకు చెందిన వరి పొలాన్ని పరిశీలించారు. రసాయనాలు వాడకుండా వరిసాగు చేసిన విధానాన్ని డా.రాజీవ్ కుమార్ నేతృత్వంలోని నీతి ఆయోగ్ బృందం అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సభ్యుల బృందం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డా. రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులు రాగా.. వారందరికి ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. కృష్ణా జిల్లాలోని గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో ప్రకృతి వ్యవసాయాన్ని నీతి ఆయోగ్ బృందం పరిశీలించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో నీతి ఆయోగ్ సభ్యుల బృందం మంగళవారం పర్యటించనుంది. నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు డా. రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ బృందం పర్యటించనుంది. కృష్ణా జిల్లాలోని గన్నవరం మండలం వీరపనేని గూడెంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రాజీవ్ కుమార్‌తో కూడిన నీతి ఆయోగ్ బృందం పరిశీలించనుంది. అనంతరం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సీఎంతో పాటు వివిధ శాఖల రాష్ట్రస్థాయి అధికారులతో నీతి ఆయోగ్ బృందం భేటీ కానుంది. సాయంత్రం వివిధ పరిశ్రమల ప్రతినిధులు , పారిశ్రామిక సంఘాలు , వివిధ యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లు , విద్యా సంస్థల ప్రతినిధులు, సామాజిక సంఘాల ప్రతినిధులతో నీతి ఆయోగ్ బృందం సమావేశం కానుంది.

## ముగిసిన 'సిరివెన్నెల' అంత్యక్రియలు..

### కడసారిగా కన్నీటి వీడ్కోలు





అక్షరయోధుడు సిరివెన్నెల సీతారామశాస్త్రి అంత్యక్రియలు ముగిశాయి.హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో అశ్రునయనాల మధ్య అంతిమ సంస్కారాలను పూర?తి చేశారు. ఫిల్మ్ ఛాంబర్ నుంచి ప్రారంభమైన సిరివెన్నెల అంతియాత్ర మహాప్రస్థానం వరకు కొనసాగింది. అంతిమయాత్రలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. సిరివెన్నెలను కడసారి చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. సిరివెన్నెల ఇక మనమధ్య లేరని తెలిసి కన్నీటి పర్యంతం అయ్యారు.కాగా తీవ్రమైన న్యుమోనియాతో బాధపడుతూ నవంబర్ 24న సిరివెన్నెల సీతారామశాస్త్రి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం 4.07 గంటలకు తుదిశ్వాస విడిచారు. తొలి సినిమా పేరునే తన ఇంటిపేరుగా మార్చుకున్నసిరివెన్నెల పూర్తి పేరు చేంబోలు సీతారామశాస్త్రి. విశాఖ జిల్లా అనకాపల్లిలో1955 మే 20న జన్మించిన ఆయన సిరివెన్నెల సినిమాతో పాటల ప్రస్థానాన్ని ప్రారంభించారు.అలా ఇప్పటివరకు మూడువేలకు పైగా పాటలు రాశారు. గేయరచయితగా తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో 2020 వరకు 3000 పాటలకు పైగా సాహిత్యం అందించారు. పదకొండు నంది అవార్డులు అందుకున్నారు. నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను సాధించారు. ఈ రంగంలో ఆయన కేసిన కృషికి గాను 2019లో పద్మశ్రీ పురస్కారం లభించింది.

## ఆర్భాటాల అతిశయోక్తులు పతనమయ్యాయి : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం విరుచుకుపడ్డారు. వ్యాపార ప్రయోజనాల కోసం వినియోగించే వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.100 పెంచిన నేపథ్యంలో ఆర్భాటపు మాటల అతిశయోక్తులు పతనమయ్యాయని దుయ్యబట్టారు. రాహుల్ బుధవారం ఇచ్చిన ట్వీట్‌లో, "ద్రవ్యోల్బణం ఎగబాకడంతో, ఆర్భాటపు మాటల అతిశయోక్తులు పతనమయ్యాయి" అని ఎద్దేవా చేశారు. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.100.50 పెంచుతున్నట్లు నేషనల్ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. దీంతో ఢిల్లీలో దీని ధర రూ.2,101కి చేరింది. నవంబరు 1న కూడా ఈ సిలిండర్ల ధరలను పెంచిన సంగతి తెలిసిందే. తాజా పెరుగుదల తర్వాత ప్రధాన నగరాల్లో కమర్షియల్ 19 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ ధరను పరిశీలించినపుడు, ఢిల్లీలో రూ.2,101; ముంబైలో రూ.2,051; కోల్‌కతాలో రూ.2,174.50; చెన్నైలో రూ.2,234.50కు చేరింది.

# సంపాదకీయం

గురువారం 02 డిసెంబరు 2021

## భయపెడుతున్న ఒమిక్రాన్.. అప్రమత్తతే మందు

భయపడి జాగ్రత్తలు మానేయడమా? జాగ్రత్త పడుతూ భయాన్ని వీడటమా? ఎప్పుడైనా రెండోదే అనుసరణీయం! మనం మరింత జాగ్రత్త పడాల్సిన సమయం వచ్చింది. కరోనా మూడో అల రాక, ఉధృతి వంటివన్నీ మనం?మన ప్రవర్తన మీదే ఆధారపడి ఉంటాయని వైద్యులు, శాస్త్రవేత్తలు చెబుతున్న మాటలు, హెచ్చరికలను తీవ్రంగా పరిగణించాల్సిన తరుణమిది. సరికొత్త వైవిధ్యాలతో కోవిడ్ మళ్లీ కోరలు చాస్తోంది. ఐరోపాలో కేసుల సంఖ్య, మరణాల రేటు రమారమి పెరిగింది. రష్యాతో పాటు ఉక్రెయిన్, బ్రిటన్, రుమేనియా తదితర దేశాల్లో కరోనా కలత సృష్టిస్తోంది. రష్యాలో 24 గంటల్లో 1100 మందిపైనే మరణించడంతో అన్నీ మూసేసి, పది రోజుల వేతనంతో కూడిన సెలవును ప్రకటించారు. చైనాలో కొత్త కేసులు పెరుగుతున్న తీరుకు ఆందోళన చెందిన ప్రభుత్వం నలభై లక్షల జనాభా కలిగిన వాయవ్య ప్రావిన్స్ గన్సు రాజధాని లాన్‌జువో నగరంలో సంపూర్ణ లాక్‌డౌన్ విధించింది. నగరంలోకి రైళ్లు, విమానాలను పూర్తిగా నిలిపివేసింది. కోవిడ్?19 వైరస్ కొత్త వైవిధ్యం ఏవై.4.2 కేసులు భారత్‌లోనూ బయటపడ్డాయి. కర్ణాటకలో ఈ కేసుల్ని నిర్ధారించి, అధికా రికంగా ప్రకటించారు.కేసులు పెరుగుతున్నట్టు వైద్యారోగ్య నిపుణులు ప్రకటించారు. ఈ వైరస్ బారినపడ్డ వారిని గుర్తించి, ప్రాథమిక, ద్వితీయ ప్రభావితులపై పరిశోధనలకు నమూనాలను ఇప్పటికే ప్రయోగశాలలకు చేర్చారు. ఇది డెల్టా ప్లస్ రకానికి చెందిన సరికొత్త వైవిధ్యం. దీని ప్రభావంపై జరుగుతున్న పరిశోధన ఫలితాలను బట్టి ఇదెంత ప్రమాదకారి? వైరస్ వ్యాప్తి, వ్యాధి విస్తరణ?తీవ్రత! వంటివి నిర్ధారిస్తారు. లోగడ బి.1.617 వైవిధ్యం భారత్‌లో సృష్టించిన అలజడి కోవిడ్?19 రెండోఅల ఉధృతిలో మనమంతా కళ్లారా చూశాం! అపార ప్రాణ నష్టం జరిగింది. గత కొంతకాలంగా మొత్తమ్మీద దేశంలో కేసుల సంఖ్య తగ్గినట్టే కనిపిస్తున్నా... అక్కడక్కడ తగ్గక పోవడం, కేరళ వంటి ప్రాంతాల్లో మళ్లీ పెరగటం ఆందోళన కలిగిస్తోంది.కేరళతో పాటు పొరుగు నున్న కర్ణాటక, తమిళనాడులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు తెలుగు రాష్ట్రాలు ఇప్పుడిప్పుడే మరింత అప్రమత్తమయ్యాయి. కేంద్రం కూడా తరచూ రాష్ట్రాలను హెచ్చరిస్తోంది. కోవిడ్ ప్రభావం తగ్గిందనే తలంపుతో అలక్ష్యం చేయొద్దని, పౌరులు కోవిడ్‌కు తగ్గ ప్రవర్తన (సిఎబి)తో కనీస జాగ్ర త్తలు పాటించాలని సూచిస్తోంది. ఒకటో అల ఉధృతి తగ్గుతున్న క్రమంలో మన నిర్లక్ష్యానికి, సర్కార్ల అలసత్వానికి తగిన మూల్యమే చెల్లించాల్సి వచ్చింది. రెండో అలలో పెరిగిన ఉధృతి, జరిగిన ప్రాణ నష్టం అనుభవాల్ని గుణపాఠంగా గ్రహించి అప్రమత్తంగా ఉండాల్సిన సంధికాలపు సందర్భమిది. ప్రభుత్వాలు నిర్ణయాల పరంగా, వైద్య విభాగం సన్నద్ధతపరంగా, పౌరసమాజం స్వీయ నియంత్ర ణతో వ్యవహరించాలి. రాగల ప్రమాద ఆస్కారాన్ని తగ్గించాలి. ఇది మనందరి ఉమ్మడి కర్తవ్యం!అక్కడక్కడ కోవిడ్ కేసులు పెరుగుతూ, కొత్త వైవిధ్యాలు పొడచూపుతున్న ఈ సమయంలోనే ఉపఎన్నికలు, పండుగలు, ఇతర శుభకార్యాలున్నాయి. వాటిల్లో పాల్గొనేవారి సంఖ్యా పరిమితులకు మనవాళ్లెప్పుడో తిలోదకాలిచ్చారు. ఎక్కడ చూసినా, జనం ఏ బెరుకూ?జాగ్రత్తలు లేకుండా పెద్ద సంఖ్యలో గుమిగూడుతున్నారు. జనాభాలో 75 శాతానికి పైబడి మాస్కులు లేకుండానో, నామ మాత్రంగా ధరించో ఉంటున్నారని ఒక అధికారిక సర్వేనే వెల్లడించింది. భౌతిక దూరాలు పాటిం చడం, శానిటైజర్ల వినియోగం కూడా తగ్గింది. ఇప్పుడు దాదాపు ఏ కట్టడీ (లాక్‌డైన్) లేదు. ఆంధ్ర ప్రదేశ్‌లో రాత్రిపూట కర్ఫ్యూ ఇంకా అమలవుతోంది.దేశమంతా బడులు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థల్ని తెరిచారు. సినిమాలు, మాల్ సెంటర్లు, వాణిజ్యం, వర్తకం వంటి కార్యకలాపాల కేంద్రాల న్నింటినీ తెరచుకొమ్మన్నారు. విధి?నిషేధాలతో జనహితంలో కట్టడి పాటించడం ఒకవైపు, రోజు వారీ కార్యకలాపాల్ని పునరుద్ధరించి, ఆర్థిక వ్యవస్థను పరుగెత్తించడం మరోవైపు... ప్రభుత్వాలకు పరస్పర విరుద్ధ ప్రయోజనాంశాలు! పరిస్థితులు చెయిదాటి మళ్లీ కట్టడి విధించాల్సిన పరిస్థితులే వస్తే... పౌరులు, ముఖ్యంగా పేద?అల్పాదాయ వర్గాలు ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా దినకూలీలు! ఇది పునరావృతం కాకుండా పౌరసమాజమే చొరవ తీసుకోవాలి. మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటించడం, నిరంతర పరిశుభ్రత బాధ్యతగా భావించి, పాటించాలి.సామూహిక రోగనిరోధకతపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. బూస్టర్ డోస్‌ల అవసరం పెరుగు తోంది. వివిధ దేశాల్లో అందుకోసం ప్రత్యేక అనుమతులు ఇస్తున్నారు. వెనుకబడిన పలు దేశాల్లో ఇంకా తొలి విడత టీకా ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. ఈ అసమానతలు మంచిది కాదు. మనం వంద కోట్ల టీకాలివ్వడం ఇటీవలే పూర్తిచేసుకున్నాం. మూడో అల వచ్చినా తట్టుకునేలా ఆక్సిజన్ సరఫరా, పడకల అందుబాటు, ఇతర వైద్య వ్యవస్థల్ని రాష్ట్ర?కేంద్ర స్థాయిలో సమకూర్చుకుం టున్నాం.రెండు టీకాలు తీసుకున్న తర్వాత కొన్ని నెలలకు రోగనిరోధకత పడిపోయి వ్యాధులు ప్రబలే ప్రమాదముందని ఓ అధ్యయన నివేదిక చెబుతోంది. దానికి విరుగుడుగా అందరూ బూస్టర్ డోస్ తీసుకోవాల్సి ఉ ంటుందనే ప్రచారం మిన్నంటింది. కోవిడ్‌ని ఎదుర్కొనే క్రమంలో ప్రపంచ జనమంతా ఇలా నిరంతరం టీకాలు, బూస్టర్లు తీసుకుంటూనే ఉండాల్సి వస్తే, ఇదొక ఫార్మా కార్పొరేట్?పారిశ్రామిక రంగం దీర్ఘకాలిక కుట్రేమో? అన్న అనుమానాలకు బలం చేకూరుతోంది. ఇలాంటి అరిష్టాలన్నీ అధిగమించి గట్టెక్కాలంటే పౌరుల అప్రమత్తత, జాగ్రత్తలే ప్రధానం!

# ఐటీ హబ్ గా విశాఖ



విశాఖపట్టణం, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్) నూతన టెక్నాలజీ ఆవిష్కరణలకు విశాఖపట్నం వేదిక కానుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేలా రెండు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ) కేంద్రాలు విశాఖలో సిద్ధమయ్యాయి. దేశ పారిశ్రామిక రంగంలో ఆటోమేషన్‌ను పెంచే విధంగా ఇండస్ట్రీ?4 టెక్నాలజీకి సంబంధించి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా విశాఖ స్టీల్‌లో కల్పతరువు పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ రూపుదిద్దుకుంది. ఈ కేంద్రం ఏర్పాటుకు స్టీల్ ప్లాంట్ రూ.10 కోట్లు కేటాయించగా కేంద్రం రూ.30 కోట్లను మంజూరు చేసింది. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటవుతున్న ఇండస్ట్రీ?4 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను జనవరిలో కేంద్రమంత్రుల ద్వారా ప్రారంభించేలా ఎస్‌టీపీఐ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.మరోవైపు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి మరో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఆంధ్రా విశ్వవిద్యాలయంలో నాస్కామ్ నెలకొల్పింది. ఆంధ్రా యూనివర్సిటీలో సుమారు 3,700 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని పరికరాలతో కూడిన ల్యాబ్, 3?డీ ప్రింటర్స్, పీసీబీ ప్రొటోటైప్ మెషీన్స్, సోల్డరింగ్ స్టేషన్లు, హైఎండ్ ఆసిలోస్కోప్స్‌తో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టెక్నాలజీలో శిక్షణ ఇవ్వనున్నారు. నాస్కామ్ ఏర్పాటు చేసిన సీవోఈని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖరన్, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. విశాఖపట్నంలో పలు భారీ పరిశ్రమలు ఉన్నందున నాలుగో తరం పారిశ్రామిక ఆవిష్కరణలను ప్రోత్సహించేలా రెండు సీవోఈలు సిద్ధం కావడంతో స్టార్టప్ కంపెనీలు నగరానికి క్యూ కడతాయని ఐటీ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. పరిశ్రమల్లో ఆటోమేషన్‌ను పెంచేందుకు బిలియన్ డాలర్లు వ్యయం చేస్తున్నారని, ఈ రంగంలో కృషి చేస్తున్న అన్ని స్టార్టప్ కంపెనీలు ఇప్పుడు విశాఖకు రానున్నాయని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) అంచనా వేస్తోంది.విశాఖలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ద్వారా ఆరోగ్యం, వ్యవసాయం, ఇంధన రంగాల్లో టెక్నాలజీ వినియోగానికి సంబంధించిన అప్లికేషన్ల అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు నాస్కామ్ తెలిపింది. ప్రభుత్వ విభాగాలకు సంబంధించి విద్య, వైద్యం, సంక్షేమ శాఖల్లో ఐవోటీ, ఏఐ టెక్నాలజీని వినియోగించే విధంగా నాస్కామ్ పలు అప్లికేషన్లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే మార్క్‌ఫెడ్‌తో కలసి డిజిటల్ ఎంఎస్‌పీ ప్రొక్యూర్‌మెంట్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసింది.

# విశాఖ నుంచి విదేశాలకు...

విశాఖపట్టణం, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్)డెస్టినేషన్ సిటీ.. మోస్ట్ హ్యాపెనింగ్ సిటీ.. బీచ్ సిటీ.. ఇలా క్రేజీ సిటీగా పేరు గడించిన విశాఖపట్నం నుంచి ఇకపై విదేశాలకు విహారనౌక సర్వీసులు ప్రారంభించే దిశగా వైజాగ్ పోర్ట్ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకోసం వైజాగ్ పోర్ట్‌లో క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. కాంట్రాక్టు దక్కించుకునే సంస్థ ఏడాదిలో పూర్తి చేయాలని నిబంధనలు సైతం పెట్టారు. సుమారు 100 కోట్ల ఖర్చుతో ఈ క్రూయిజ్ నిర్మాణం ఏడాది లోపు పూర్తి చేయనున్నారు. ఇందులో బెర్త్ కాస్ట్ 65 కోట్లు కాగా టెర్మినల్ బిల్డింగ్ 35 కోట్లు తో నిర్మించేలా అంచనాలు, అనుమతుల మంజూరు ఇప్పటికే పూర్తయ్యాయి.ఒకవైపు క్రూయిజ్ టెర్మినల్ పనులు ప్రారంభం కానుండగా.. మరోవైపు ఆ సమయం నాటికి విశాఖ నగరానికి అంతర్జాతీయ విహార నౌకలు రప్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు అధికారులు. నౌకాయాన శాఖతో పాటు టూరిజం మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇప్పటికే ట్రావెల్ ఆపరేటర్స్‌తో ఆ దిశగా చర్చలు ప్రారంభించారు. దేశంలోని ముంబయి, కొచ్చి, గోవా, మంగళూరు, చెన్నై తదితర నౌకాశ్రయాలకు అంతర్జాతీయ విహార నౌకలు వస్తుంటాయి. ఆయా సర్వీసులు నడిపే సంస్థల ప్రతినిధులతో మాట్లాడి.. విశాఖకు కూడా విదేశీ పర్యాటకులు వచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లాలని అనుకునే వారికి వీలుగా సర్వీసులు ఉండేలా షిప్పింగ్ ఏజెంట్లు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. అంతర్జాతీయ విహార నౌకలు ప్రయాణీకులకు ఫైవ్ స్టార్ హోటళ్లలోని సౌకర్యాలను అందిస్తాయి. రెస్టారెంట్లు, స్విమ్మింగ్ పూల్స్, ఇండోర్ గేమ్స్, థియేటర్లు, డాన్స్ ఫ్లోర్స్ లాంటి వినోదాన్ని అందించే అని సదుపాయాలు

ఇందులో అందుబాటులో ఉంటాయి. ఒక్కో క్రూయిజ్‌లో 1500 మంది నుంచి 2 వేల మంది వరకు ప్రయాణించవచ్చు. దీనిపై విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్ మాట్లాడుతూ.. విశాఖ నౌకాశ్రయంలో క్రూయిజ్ టెర్మినల్ అందుబాటులోకి రానుండడం ఒక మైల్ స్టోన్ అన్నారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్, కేంద్ర నౌకాయాన సంస్థ, కేంద్ర, రాష్ట్రాల పర్యాటక శాఖల భాగస్వామ్యంతో క్రూయిజ్ టెర్మినల్ ఏర్పడుతోందని తెలిపారు రామ్మోహన్ రావ్. నిర్వహణకు అవసరమైన అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని, విశాఖకు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు రావడానికి ఈ క్రూయిజ్ టెర్మినల్ ఎంతో ఉపయోగపడుతుందని, సాధ్యమైనంత త్వరలో ఈ కలను సాకారం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్ రావ్ వివరించారు.

# రంగంలోకి పీకే టీమ్...

విజయవాడ, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్)ప్రశాంత్ కిషోర్ ఇంకా రంగంలోకి దిగలేదు. నవంబరు నుంచి పీకే టీం రంగంలోకి దిగుతుందని జగన్ స్వయంగా మంత్రివర్గ సమావేశంలో చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈసారి ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయన్న చర్చ జరుగుతుంది. గతంలో పార్టీ అధికారంలోకి లేకపోవడం, జగన్ చరిష్మా ఇవన్నీ కలసి వచ్చాయి. దీనికి తోడు ఎక్కువ మంది నియోజకవర్గాలకు కొత్త నేతలు కనపడటం వల్ల కూడా వైసీపీలో జనం కనెక్ట్ అయ్యారు. .. కానీ ఈసారి వారే మళ్లీ బరిలోకి దిగబోతున్నారు. పెద్దయెత్తున ఎమ్మెల్యేలను మార్చే అవకాశం లేదు. పార్టీని నమ్ముకున్న వారిని పక్కన పెడితే ఆ నియోజకవర్గంలో మళ్లీ రెండు గ్రూపులను పార్టీ హైకమాండ్ ప్రోత్సహించినట్లవుతుంది. అందుకే తొలుత 70 మంది వరకూ ఎమ్మెల్యేలను జగన్ తప్పిస్తారని భావించినప్పటికీ ఆ దిశగా ఆలోచన విరమించుకున్నారని తెలిసింది. ఇప్పటికే అనేక నియోజకవర్గాల్లో రెండు గ్రూపులున్నాయి. సిట్టింగ్‌లకు టిక్కెట్ ఇవ్వకపోతే పార్టీ మరింత బలహీనమవుతుందని అంచనాలో ఉన్నారు ఇక ప్రశాంత్ కిషోర్ టీం కూడా మూడేళ్లకు ముందే రంగంలోకి దిగడం అనవసరమని భావిస్తున్నారట. ఇప్పుడు నియోజకవర్గాల్లో సర్వే చేసినా ఏం ఉపయోగం లేదని చెప్పారట. చివరి ఏడాది అయితే అభ్యర్థి ఎవరు? అసంతృప్తి ప్రజలలో ఎమ్మెల్యేపై ఎంత ఉన్నది అన్నది సర్వేల ద్వారా తెలుసుకోవచ్చని, ఇప్పటి నుంచి సర్వేలు చేయడం కూడా అనవసరమని ప్రశాంత్ కిషోర్ అభిప్రాయపడినట్లు తెలిసింది. పశ్చిమ బెంగాల్ లోనూ ఏడాదిన్నర ముందుగానే సర్వేలు, అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించామని ఆయన చెప్పడంతో ఇప్పుడే పీకే టీంను నియోజకవర్గాల్లో తిప్పడం అనవసరమని జగన్ భావించారు. అందుకే ప్రశాంత్ కిషోర్ టీం ఏపీలోకి ఇంకా అడుగు పెట్టలేదన్న చర్చ పార్టీలో జరుగుతుంది. నవంబరు నెలలోనే రావాల్సి ఉండగా మూడేళ్ల ముందు అనవసరమని భావించి తమ ఏపీ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు సమాచారం.

సర్వేలతో అప్ డేట్స్

ఆంధ్రప్రదేశ్ లో అన్ని ఎన్నికలు పూర్తయ్యాయి. వైసీపీ వన్ సైడ్ విజయం సాధించింది. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ పెత్తనం వైసీపీదే. ప్రతిపక్షాల ఊసే లేకుండా పోయింది. ఎన్నికల్లో అక్రమాలు, బెదిరింపులు, అవకతవకలు అనిచెబుతున్నా 80 నుంచి 90 శాతం ఫలితాలు వైసీపీ వైపునే ఉన్నాయి. ప్రజలు జగన్ పక్షాన నిలిచారనే చెప్పాలి. ఇంత పెద్ద విజయాలు వైసీపీలో అతి విశ్వాసాన్ని పెంచుతాయని కొందరు అంటున్నారు. కానీ జగన్ రాజకీయం వేరు అంటున్నారు వైసీపీ నేతలు. జగన్ ఇంతకు ముందులా కాదు. రాజకీయంగా రాటు దేలాడు. ప్రతి ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. జనంలోకి తన సంక్షేమ పథకాలు పనిచేస్తున్నాయని సంకేతాలను పంపారు. గెలుపుకు కారణం ఏదైనా కావచ్చు. గెలుపు మాత్రం జగన్ ఖాతాలోనే పడింది. సంక్షేమ పథకాల వల్లనే ఇంతటి విజయాలు సాధ్యమయ్యాయని పార్టీ నేతలకు కూడా పరోక్షంగా హెచ్చరికలు పంపారు. తన మాటే వేదం. శాసనం అన్నది జగన్ ఈ ఫలితాలతో చెప్పకనే చెప్పారు. జగన్ కు అతి దగ్గరగా ఉన్న ఒక మంత్రి చెప్పిన దానిని బట్టి... జగన్ అధికారుల మాటలను నమ్మరు. తనకంటూ ఐదు రకాల సర్వే సంస్థలను జగన్ పెట్టుకున్నారు. ఐదు మార్గాల ద్వారా ఎప్పటికప్పుడు సర్వే నివేదికలు తెప్పించుకుంటాడు. ప్రజల్లో తన నిర్ణయంపై వ్యతిరేకత ఉ ందని ఆ సర్వేల్లో తేలితే వెంటనే నిర్ణయాన్ని మార్చుకోవడానికి కూడా వెనుకడారట. అంతెందుకు ఇంటలిజెన్స్ సర్వేలు, అధికారుల సంతృప్తి నివేదికలను జగన్ అసలు చూడనే చూడరంటున్నారు జగన్ కు సన్నిహితంగా ఉండే ఆ మంత్రి. ఇక జగన్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని గ్రహించారు. వారికి కొంత సమయం ఇవ్వనున్నారు. పనితీరు మార్చుకుని ప్రజల్లో విశ్వాసాన్ని పొందకపోతే నిర్దయగా వచ్చే ఎన్నికల బరి నుంచి తప్పించనున్నారు. ఈ మేరకు కొందరికి జగన్ సిగ్నల్స్ కూడా ఇచ్చారంటున్నారు. విజయాలను చూసి చంకలు గుద్దుకోవద్దని, ప్రజల్లో మార్పు ఒక్క రోజులో కూడా వస్తుందని జగన్ వారికి హెచ్చరికలు జారీ చేసినట్లు చెబుతున్నారు. మొత్తం మీద జగన్ ను తక్కువగా అంచనా వేస్తే తప్పులో కాలేసినట్లే. ఆయన వ్యూహాలు ఆయనకు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే జగన్ అందరినీ సిద్ధం చేస్తున్నారు.

# అధిక వానలతో వేరు సెనగ ఇబ్బందులు

అనంతపురం, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్)వేరుశనగ రైతు భయపడిందే జరిగింది. వర్షాభావం, అధిక వర్షాలతో ఈ ఏడాదీ పంట చేతికందకుండా పోయింది. గత ఏడాది కూడా వేరుశనగ రైతులు నష్టాలను చవిచూశారు. దీంతో, ప్రస్తుత సీజన్ ప్రారంభంలో మంచి వర్షాలు పడినా రైతులు విత్తనం వేయడానికి వెనకడుగు వేశారు. అనంతపురం జిల్లాలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 15 లక్షల ఎకరాలు కాగా, ఈ ఏడాది 10.89 లక్షల ఎకరాల్లో వేశారు. పంట దిగుబడికి కీలకమైన నెలల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఎకరానికి పది బస్తాల వరకు దిగుబడి రావాల్సి ఉండగా మూడు బస్తాలు కూడా రావడం లేదు. వచ్చిన కాస్త పంట కూడా నూర్పిడి జరుగుతున్న సమయంలో కురుస్తోన్న వర్షాలకు చేతికందకుండాపోతోంది.వేరుశనగను జూన్, జులై నెలల్లో వేస్తారు. ఈ ఏడాది ఈ నెలల్లో జిల్లాలో మంచి వర్షాలే పడ్డాయి. జూన్ సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లు కాగా, 102 మిల్లీమీటర్లు, జులైలో సాధారణ వర్షం 67.4 మిల్లీమీటర్లు కాగా, 124.2 మిల్లీమీటర్లు నమోదైంది. ఈ రెండు నెలలూ సాధారణం కంటే అధికంగా వర్షాలు పడ్డాయి. పంట దిగుబడికి కీలకమైన ఆగస్టులో 88.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షాపాతానికి గానూ 71.5 మిల్లీమీటర్లు, సెప్టెంబరులో 118.4 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గానూ 46.2 మిల్లీమీటర్లు నమోదైంది. కీలకమైన సమయంలో లోటువర్షపాతం వల్ల దిగుబడి బాగా పడిపోయింది. పంట నూర్పిడి జరిగే అక్టోబరు ఆఖరు, నవంబరులో అధిక వర్షాలు పడ్డాయి. అక్టోబరులో 110.7 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతానికిగానూ 125.9 మిల్లీమీటర్లు, నవంబరులో ఇప్పటికి 17.7 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతానికి గానూ ఇప్పటికే 44.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అవసరమైన సమయంలో సరైన వర్షాలు లేకపోవడం, అవసరం లేని సమయంలో అధిక వర్షాలు పడడంతో రైతులు రెండు రకాలుగా నష్టపోయారు. నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశానని, ఎకరానికి రూ.25 వేలకుపైగా ఖర్చయిందని, పెట్టుబడిలో ఒక్క రూపాయి కూడా తిరిగొచ్చే పరిస్థితి లేదని బుక్కరాయసముద్రానికి చెందిన రైతు నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వేరుశనగ పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారమివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# నది మధ్యలో గుడుంబా

ఒంగోలు, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్)బయట ఎక్కడ గుడుంబా బట్టీ పెట్టిన పోలీసులు పట్టుకుంటున్నారని తెలిసి కొంతమంది కేటుగాళ్లు విన్నూతంగా ఆలోచించారు. ఏకంగా పోలీసులకు తెలియకూడదని వాగు మధ్యలో పొదల మాటున నీటిపై తేలియాడే గుడుంబా బట్టీని సిద్ధం చేశారు. చీరాల నడిబొడ్డున వెలుగుచూసిన ఈ ఘటన అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కుందేరు వాగులో ఏపుగా పెరిగిన రెల్లుదుబ్బుల మధ్య నీటిలో తేలే స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అక్కడి నుంచి గుడుంబా తయారుచేయడం మొదలుపెట్టారు. అయితే ఎప్పటిలాగే సమాచారం లీక్ కావడంతో అధికారులు దాడులు నిర్వహించారు.కుందేరు వాగు లోపలికి వెళ్ళి దాడి చేశారు. వాగు మధ్యలో ఏర్పాటు చేసుకున్న స్థావరంలో భారీగా బెల్లం ఊటను గుర్తించారు. నాటుసారా కాసేందుకు సిద్ధం చేసిన నల్లబెల్లం, కరక్కాయ నిల్వలను ధ్వంసం చేశారు. నిందితులు ఏరు మధ్యలో ఏపుగా పెరిగిన రెల్లుదుబ్బుల మధ్య బయటకు కనిపించని విధంగా స్థావరాన్ని తయారు చేసుకొని కొంతకాలంగా గుడుంబా కాస్తున్నట్టు సమాచారం. 4వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అక్కడే దాచి ఉంచిన 250 కేజిల నల్లబెల్లం, 50 కేజీల కరక్కాయలను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా స్థావరాన్ని నడుపుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.ఎక్కడో నదులు, సముద్రాల మధ్య ఇలాంటి స్థావరాలు ఏర్పాటు చేసుకుని స్మగ్లింగ్ ముఠాలు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించడం విన్నాం. కానీ వాగు మధ్యలో ఇలాంటి స్థావరాన్ని చూసి అధికారులు ఖంగుతిన్నారు. వాగు మధ్యలో తేలియాడే స్థావరాన్ని చెక్కలతో నిర్మించుకున్నారు. అక్కడే బెల్లంఊట తయారు చేస్తారు. సారాలో వినియోగించే నల్లబెల్లం, కరక్కాయలు, ఇతర సామాగ్రిని సిద్ధం చేసుకున్నారు. వాగు మధ్యలో చెక్కలపై బట్టీలు పెట్టడం సాధ్యం కాదు కాబట్టి వెరైటీగా గ్యాస్ పొయ్యిలను ఏర్పాటు చేసుకున్నారు.ఏరు మధ్యలోకి చేరుకోవాలంటే నడుంలోతు బురదనీటిలో నడచివెళ్ళాల్సి ఉంటుంది. ఇంత రిస్క్ చేసి ఎవరూ ఇక్కడికి రారనుకుని దుకాణం పెట్టేశారు. ఏరు మధ్యలో బురదలో ఏపుగా పెరిగిన రెల్లుదుబ్బు చుట్టూ రక్షణ కవచంగా ఉందని భావించారు. అయితే తాడిని తన్నేవాడు ఒకడుంటే, వాడి తలను తన్నేవాడు మరొకరు ఉ ంటారన్నట్టుగా అధికారులు ఈ అక్రమార్కుల గుట్టు రట్టు చేయడం విశేషం.

# ఆగని సినిమా టిక్కెట్ల లొల్లి

విజయవాడ, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్()ఏపీలో సినిమా టిక్కెట్ల అంశంపై లొల్లి నడుస్తున్న విషయం తెలిసిందే. ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా జగన్ ప్రభుత్వమే సినిమా టిక్కెట్లు అమ్మడానికి సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. పైగా రాష్ట్రంలో ఇంకా ప్రజలు ఏ సమస్య వల్ల ఇబ్బందులు పడటం లేదన్నట్లుగా..కేవలం సినిమా టిక్కెట్ల రేట్లు ఎక్కువగా ఉండటం వల్లే ప్రజలు తెగ బాధలు పడిపోతున్నట్లుగా జగన్ ప్రభుత్వం?సినిమా టిక్కెట్ల రేట్లని అదుపు చేయడానికి?ప్రభుత్వమే టిక్కెట్లని అమ్మే బాధ్యత తీసుకుంది.అలాగే బెనిఫిట్ షోలకు అనుమతి లేదని..నాలుగు షోలు మాత్రమే నడపాలని, అదే విధంగా సినిమా టిక్కెట్ల ధరలు ఒకే విధంగా అమలు చేయాలని డిసైడ్ అయింది. ఇక ఈ అంశంపై ఇప్పుడు టాలీవుడ్ ప్రముఖులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పైన పునరాలోచన చేయాలంటూ మెగాస్టార్ చిరంజీవి ట్వీట్ చేసారు. అటు నిర్మాత సురేష్ బాబు సైతం.. .నిర్ణయం తీసుకుంటామని ఏపీ మంత్రి పేర్ని నాని స్పష్టం చేసారు. ప్రముఖ నిర్మాత సురేష్ బాబు సైతం అన్ని సినిమాలకూ ఒకే టికెట్ రేట్ పెట్టడం




సరికాదని, దానివల్ల పెద్ద సినిమాలు నష్టపోతాయని, ప్రభుత్వం తమ నిర్ణయం గురించి మరోసారి పునరాలోచించాలని కోరారు. బాలయ్య సైతం సినిమాలు బాగా నడిచేలా ప్రభుత్వాలు సహకరించలాని కోరారు.అంటే అందరూ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అసంతృప్తిగానే ఉన్నారు. సినిమా అంటే ఎవరైనా ఇష్టపడి చూస్తారని, అది వారి ఇష్టమని అలాంటప్పుడు రేట్లు అనేవి అంత ఎఫెక్ట్ అవ్వవని అంతా అంటున్నారు. కానీ జగన్ ప్రభుత్వం ప్రజలపై మిగతా అంశాలపై పన్నుల భారం పెంచిందని, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఇసుక, మద్యం, కరెంట్, ఆర్టీసీ ఛార్జీలు భారీగా పెరిగాయని, మరి వీటిపై ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదని అందరు హీరోలా ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. అయితే సినిమా టిక్కెట్లు, షోల విషయంలో జగన్ ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే అందరి హీరోల ఫ్యాన్స్ యాంటీ అయ్యేలా ఉన్నారు. మరి దీనిపై జగన్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల ఆవేదన

కడప, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్)అన్నమయ్య డ్యాం కట్ట తెగిపోవడంతో జల ప్రళయం జరిగి 11 రోజులు అవుతున్నా విషాదఛాయలు దీని పరిధిలోని గ్రామాలను నేటికీ వదలలేదు. పులపత్తూరు తోగురుపేట రామచంద్రపురం, మందపల్లిలలో భారీ వర్షాలు పడ్డాయి. అధికారులు ప్రణాళికతో వ్యవహరించి ఉంచి సరైన సమయంలో అన్నమయ్య గేట్లు ఎత్తి ఉంటే ఇలాంటి ఉపద్రవాన్ని చూడాల్సి వచ్చేది కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ఉపద్రవం జరగకుండా చివరి వరకు తమ స్థాయిలో ముమ్మర ప్రయత్నం చేశామని, అయినా, ఫలితం లేకపోయిందని అంటున్నారు. నదీ పరీవాహక ప్రాంతంలో వరదల్లో బాధితులకు చెందిన సుమారు వంద ఇల్లు నేలమట్టం కాగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇళ్లల్లోకి చేరిన వరద నీరు విలువైన వస్తువులను సైతం లాక్కొనివెళ్లి ప్రవాహంలో కలిసేసింది. కొంతమంది కట్టుబట్టలతో మిగిలారు. బీరువాలో దాచుకున్న విలువైన పత్రాలు, బంగారు, నగదు నీటి పాలయ్యాయి. వరద బీభత్సం వారిని కోలుకోలేని దెబ్బతీసింది. రాజంపేట మండలం పేటపులపుత్తూరు, తోగురుపేట, మందపల్లి, రామచంద్రపురంలలో ఇళ్లు నేలమట్టమైన బాధితులు ప్రస్తుతం గుడిసెలు, డేరాలు వేసుకొని తమ ఇళ్ల శిథిలాల వద్ద జీవనం సాగిస్తున్నారు. తమకు యుద్ధప్రాదికతన పునరావాసం కల్పించాలని బాధితులు కోరుతున్నారు. డ్యాంకు గండిపడడంతో ఈ గ్రామాలకు చెందిన 24 మంది మృతి చెందారు. వీరిలో ఒకే కుటుంబానికి చెంది తొమ్మిది మంది ఉన్నారు. గల్లంతైన మరో 15 మంది ఆచూకీ నేటికీ తెలియకపోవడంతో ఆయా కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉన్నాయి. ఆ నాలుగు పల్లెల్లో నేడు ఎటు చూసినా బాధితుల కన్నీటి వేదనలు, హృదయ విదారక దృశ్యాలు కలిచి వేస్తున్నాయి. తుపాను నేపథ్యంలో మళ్లీ ఆదివారం నుండి వర్షాలు కురుస్తుండడంతో వారిలో మళ్లీ తీవ్ర ఆందోళన మొదలైంది.

# ఆగని ఆక్రమణలు

విజయనగరం, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్)మేదరబంద ఆక్రమణలు ఆగడం లేదు. ఎవరు అధికారంలోకి వస్తే వారే బందను ఆక్రమించుకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. మేదరబందను ఆక్రమించి, పేదల నుంచి అక్రమ వసూళ్లు చేసి అమ్ము కుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇదే వార్డు నుంచి గెలుపొందిన కాంగ్రెసు, టిడిపి నాయకులు సొమ్ము చేసుకోగా, నేడు వైసిపి నుంచి విజయం సాధించిన నాయకులు దండుకుంటు న్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో మేదరబంద చుట్టూ ఆక్రమించి, అక్రమ ంగా ఇళ్లు నిర్మించుకోగా, నేడు బంద మధ్య భాగంలో ఆక్రమించేందుకు ప్రయ త్నాలు చేస్తున్నారు.గతంలో టిడిపి, కాంగ్రెస్ హయాంలో డబ్బులు తీసుకుని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించినట్లు ఆరోప ణలు వచ్చాయి. ప్రస్తుతం మేదరబంద ఆక్రమించి, చదును చేసి పేదల నుంచి అక్రమ వసూళ్లు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. దీనికి బలం చేకూరేలా మేదరబందలో మున్సిపల్ అధి కారులు నిర్మించిన చేపల విక్రయ కేంద్రం పక్కన బందను ఇంటి నిర్మాణ వ్యర్థాలతో కప్పేస్తున్నారు. ఇదే స్థలంలో ఉన్న పశువులశాలను మున్సిపల్ అధికారులు రెండు రోజుల క్రితం తొలగించారు. అదే స్థలం లో ఇంటి నిర్మాణ వ్యర్థాలు వేసి కప్పేస్తు న్నారు. ఎవరు వ్యర్థాలు వేయమన్నారని ట్రాక్టర్ యజమా నిని ప్రశ్నించగా, పురపాలకులే వేయమ న్నారని చెప్పడం విశేషం. దీంతో ఆక్రమణ లలో వైసిపి నాయకులు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణ లకు బలం చేకూరు తుంది.మేదరబంద ఆక్రమణలపై చర్యలు తీసుకుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. బందను అక్రమిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు, కౌన్సిల్ స్పందించి మేదరబంద ఆక్రమణలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.ప్రభుత్వ స్థలాలు, బందలను ఆక్రమిస్తే కేసులు పెడతామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. మేదరబందలో ఇళ్ల నిర్మాణ వ్యర్థాలు వేసిన వారిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని, కబ్జాకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన తెలిపారు.

## తిరుమల ఘాట్ రోడ్డు మూసివేత

తిరుమల డిసెంబర్ 1, (న్యూస్ పల్స్)తిరుమల రెండవ ఘాట్ రోడ్డును తాత్కాలికంగా మూసివేసారు. లింక్ ఘాట్ రోడ్డు సమీపంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఘటనలో ఒక ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.భక్తులు .ఇబ్బంది పడుతున్నారు. ఎగువ ఘాట్ రోడ్ లో నాలుగు చోట్ల రహదారి దెబ్బ తిన్నది. చెట్లు కూలాయి. కొండ చరియులు విరిగి పడ్డాయి. కొన్నిచోట్ల రోడ్డు కుంగిపోయింది. అలిపిరి వద్ద వాహనాలను ఆపేవేసారు. రహదారి మద్యలో చిక్కుకు పోయిన వాహనాలను వెనుకకు తెప్పించారు. కొండచరియలు తొలగించే పనిలో టీటీడీ విజిలెన్స్,ఇంజనీరింగ్, అటవిశాఖధికారులు నిమగ్నమయ్యారు. ఇటీవల తిరుమల, తిరుపతిలో భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. రెండు ఘాట్ రోడ్లలో చాలాచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో కూడా తిరుమలకు రాకపోకలపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా తిరుపతిని వర్షాలు చుట్టుముట్టాయి. ఈ భారీ వర్షాలకు శేషాచలం కొండల్లోని డ్యాములు, చెక్ డ్యామ్ లు పొంగి పోయాయి. ఈ వర్షాల కారణంగా తిరుమల లో రూ. 4 కోట్లకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని టీటీడీ అధికారులు తెలిపారు.

## ఘాట్ రోడ్డులో మళ్లీ కొండచరియలు



తిరుమల, డిసెంబర్ 1తిరుపతి, తిరుమలలో కురస్తున్న వర్షాలకు ఘాట్ రోడ్డులో మళ్లీ కొండచరియలు విరిగిపడ్డాయి. పెద్ద పెద్ద బండరాళ్లు రోడ్డు మీద పడడంతో రహదారి కోతకు గురైంది. రెండో ఘాట్ రోడ్డులోని చివరి మలుపు వద్ద భారీగా చీలికలు ఏర్పడ్డాయి. భాష్యకార్ల సన్నిధికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. టీటీడీ అత్యవసర సిబ్బంది చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వీలైనంతవరకు త్వరగా రహదారికి మరమ్మతులు నిర్వహించి భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తున్నారు.కాగా ఇటీవల తిరుమల, తిరుపతిలో భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. రెండు ఘాట్ రోడ్లలో చాలాచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో కూడా తిరుమలకు రాకపోకలపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా తిరుపతిని వర్షాలు చుట్టుముట్టాయి . ఈ భారీ వర్షాలకు శేషాచలం కొండల్లోని డ్యాములు, చెక్ డ్యామ్ లు పొంగి పోయాయి. ఈ వర్షాల కారణంగా తిరుమల లో రూ. 4 కోట్లకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని టీటీడీ అధికారులు తెలిపారు.

## వరదలో వ్యక్తి గల్లంతు

నెల్లూరు నెల్లూరు జిల్లా గూడురు రూరల్ తిప్పవరప్పాడు గ్రామం వద్ద వరదలో వ్యక్తి గల్లంతు అయ్యాడు. యరమపు నారాయణ రెడ్డి, వయసు 53 అనే వ్యక్తి నిన్న అర్ధరాత్రి 12.30 దాటాక గ్రామ సమీపంలో చెరువు కలుజువద్ద ఉన్నట్టు తర్వాత కాసేపటికి తర్వాత నుండి కనిపించకుండా పోయినట్టు కుటుంబ సభ్యులు తెలియచేస్తున్నారు,వరదలో ఏమైనా కొట్టుకు పోయాడా అని సందేహిస్తున్నారు. మంగళవారం బాలాయపల్లి మండలంలో మూడు చెరువులుకు గండి కొట్టడంతో ఆ నీళ్ళన్నీ ఒక్కసరిగా దిగువ గ్రామాల్లోకి రావడంతో తిప్పవరప్పాడు తో సహా అనేక గ్రామాలు వరద తాకిడికి గురయ్యాయి...ఈ ప్రవాహంలో ఏమన్నా కొట్టుకు పోయాడా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు కుటుంబ సభ్యులు..

# తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

దుంపలగట్టు జిల్లాలోని అన్ని గ్రామాల్లో అధిక వర్షాలతో, వరదలతో పంటలు మొత్తం నీట మునిగిపోయి పూర్తిగా దెబ్బతిన్ననీదున అధికారులు పరిశీలనతో, అంచనాలతో నిమిత్తం లేకుండా మొత్తం రైతాంగానికి నష్టపరిహారం చెల్లించేలా జిల్లా అధికార యంత్రాంగానికి గురువారం పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఖాజీపేట మండలం దుంపలగట్టు లోని ఆయన స్వగృహంలో బుధవారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ..అక్కడక్కడా తడిసిన, రంగుమారిన ధాన్యం ఉందని వాటిని గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వమే తక్షణీ కొనుగోలు చేయాలని, ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితుల్లో రబీలో పైర్లు పెట్టుకునేందుకు నీరు ఇవ్వడంతో పాటు ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని, రైతాంగానికి ఎకరాకు రూ. 25 వేలు, హెక్టారుకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ప్రతి ఇంటికి నష్ట పరిహారం ఇచ్చేలా ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వాలని రెడ్యం విజ్ఞప్తి చేశారు.రాయచోటి మండలం

### రైతుల పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

గరుగుపల్లె లో దెబ్బతిన్న ఇళ్ళకు చెక్కులు పంపిణీ చేసే కార్యక్రమంలో ఒక వర్గానికే చెక్కులు ఇస్తున్నారని బాధితులు నిలదీస్తే చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి, పోలీసుల సాక్షిగా బాధితుల పై దాడి దాడి చేసిన వైసీపీ కార్యకర్తల పై కేసులు నమోదు చేయాలని, పార్టీలకతీతంగా బాధితులందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయే0దుకు అధికారుల నిర్లక్ష్య0 అన్నది బహిరంగ రహస్యమని బాధ్యులైన అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించాలని తద్వారా చనిపోయిన 39 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి 25 లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో దెబ్బతిన్న బాధితులకు సంబంధించి ప్రభుత్వమే వారికి గతంలో ఉన్న ఇళ్ల స్థానంలో అదే కొలతతో ఇల్లు,లేకుంటే నష్టపరిహారం తోపాటు నష్టపోయిన వారెనీత నష్టపోయారో అంచనా వేసి వారికి నష్టపరిహారం ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి తమ పర్యటనలో స్పష్టమైన హామీ ఇవ్వాలని మరోమారు రెడ్యం విజ్ఞప్తి చేశారు.

# తిరుమల ఘాట్ రోడ్ లో తప్పిన పెను ప్రమాదం



తిరుపతి డిసెంబర్ 1, (న్యూస్ పల్స్) తిరుపతి నుంచి తిరుమలకు వెళ్ళే అప్ ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడి ఘాట్ రోడ్డు భారీగా ధ్వంసమైందని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 5 - 40 గంటల సమయంలో భారీ ఎత్తున కొండచరియలు విరిగిపడి రక్షణ గోడలు, రోడ్లు ధ్వంసమయ్యాయి. టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఈ ప్రాంతాలను పరిశీలించారు. నాలుగు చోట్ల భారీ ప్రమాదం జరిగిందని, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దయవల్ల ఎవరూ గాయపడలేదని అధికారులు వివరించారు. అనంతరం చైర్మన్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. గత 30 సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇటీవల కురిసిన వర్షాలకు తిరుమల ఘాట్ రోడ్ల లో కొండ చరియలు విరిగిపడుతున్నాయని తెలిపారు. ఉదయం 5 - 45 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు తిరుమలకు వెళుతుండగా భారీ శబ్దం, పొగ రావడంతో డ్రైవర్

### ధ్వంసమైన ఘాట్ రోడ్డుప్రాంతాలను పరిశీలించిన టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి

బస్సు నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని చైర్మన్ చెప్పారు. అప్ ఘాట్ రోడ్డులో మరో ఐదారు చోట్ల కొండ చరియలు విరిగిపడే ప్రమాదం గుర్తించామన్నారు. వీలైనంత త్వరలో రోడ్డు మరమ్మతులు చేసి, గట్టి రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని చైర్మన్ చెప్పారు. ఢిల్లీ ఐ ఐ టి నుంచి నిపుణుల బృందం బుధవారం సాయంత్రానికి తిరుపతి కి చేరుకుంటుందన్నారు. టీటీడీ ఇంజినీరింగ్, విజిలెన్స్ అధికారులతో కలిసి వారు ఘాట్ రోడ్ల పరిశీలన చేస్తారన్నారు. కొండ చరియలు విరిగిపడకుండా ఎలాంటి జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలనే విషయం పై వారు పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి రెండు, మూడు రోజుల్లో నివేదిక సమర్పిస్తారని ఆయన వివరించారు. ఆ తరువాత భవిష్యత్ లో కూడా ఇలాంటి సంఘటనలు జరక్కుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘాట్ రోడ్డు మరమ్మతులు పూర్తి అయ్యే వరకు డౌన్ ఘాట్ రోడ్డులోనే వాహనాల రాకపోకలు అనుమతిస్తామని అన్నారు. ఆన్లైన్లో దర్శనం టికెట్లు బుక్ చేసుకుని వాహనాల ద్వారా తిరుమలకు వచ్చే భక్తులు భారీ వర్షాల దృష్ట్యా తమ ప్రయాణం వాయిదా వేసుకుంటే ఆరు నెలల్లోగా దర్శనం తేదీ మార్పు చేసుకునే అవకాశం ఉందని శ్రీ సుబ్బారెడ్డి చెప్పారు. నడకదారిలో తిరుమలకు వెళ్ళే భక్తులకు మాత్రం ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన తెలిపారు. జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో గోపీనాథ్ జెట్టి,చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ జగదీశ్వరరెడ్డి, ఈఈ జగన్మోహన్ రెడ్డి,ఈ ఈ సురేంద్ర రెడ్డి, డి ఎఫ్ ఓ శ్రీనివాసులు రెడ్డి ఇతర అధికారులు చైర్మన్ వెంట ఉన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన పెరిగింది



### మంత్రి తానేటి వనిత

కొవ్వూరు అసమానతలను, ఎయిడ్స్ మహమ్మారి ని తొలగించాలనే నినాదం తో ఈ ఏడాది ఎయిడ్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు.బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి విజయ విహార్ సెంటర్ వరకు కొవ్వూరు లో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, మునిసిపల్ ఛైర్ పర్సన్ బావన రత్న కుమారి, జెడ్పిటిసి బి.వెంకట లక్ష్మి, తదితరులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. తొలుత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ, గతం కంటే ఇప్పుడు ప్రజల్లో ఎయిడ్స్ పై అవగాహన పెరిగిందని ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు కారణం అన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడడం, చెడు కలయికలు, కొన్ని సమయాల్లో రక్తం ద్వారా పొరపాటున ఎయిడ్స్ వ్యాధి సంక్రమించడం జరుగుతున్న దని మంత్రి తెలిపారు. ఎయిడ్స్ ఒక వ్యాధి కాదని, చాలా వ్యాధుల సమూహం గా అభివర్ణించ వొచ్చునన్నారు. ఈవ్యాధి సోకిన వ్యక్తి లో ఇమ్యూనిటి శక్తి తగ్గి మరణం సభవిచడం జరుగుతుందని అన్నారు. గతంలో ఎయిడ్స్ వ్యాధితో మరణించే వారని, ఇప్పుడు మెరుగైన వైద్య సేవలు, మందులు వల్ల, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కొంతమేర జీవన కాలాన్ని పెంచగలుగుతున్నామని పేర్కొన్నారు. వ్యాధిని ద్వేషించండి వ్యాధి వచ్చిన వారిని కాదు..ని మంత్రి తానేటి వనిత తెలిపారు. ఈ రోజు ఎయిడ్స్ డే. కానీ ఇలాంటి రోజు ఎప్పటికి జరుపుకోకుండా ఉండాలని ఆశ. అందుకు మనం చేయాల్సింది ఒక్కటే. మనం మన మనసును అదుపులో పెట్టుకోవటమే. గుర్తు పెట్టుకోండి ప్లీజ్. మనకు ఎయిడ్స్ రహిత సమాజం కావాలి" అని అది మనందరిపై ఉన్న భాధ్యత అన్నారు. ఈ ర్యాలీలో భాగంగా ఎయిడ్స్ సందేశాన్ని ఇవ్వడం, మానవ హారంగా ఎర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్ పర్సన్ భావన రత్న కుమారి, జెడ్పిటిసి బి.వెంకటలక్ష్మి, కార్పొరేటర్ కోడూరి శివరామకృష్ణ, ఆసుపత్రి పర్యవేక్షకురాలు డా.ఎమ్. కోటేశ్వరి, ఐసిడిసి కౌన్సిలర్ కె.సుమన్, పలువురు కార్పోరేటర్లు, వైద్యదాధికారు లు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, వివిధ పాఠశాలల, కళాశాలవిద్యార్ధిని, విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై స్పందించని సీఎం జగన్

### నాదెండ్ల మనోహర్

మండపేట డిసెంబర్ 1 ఈ ప్రభుత్వం రైతులను మోసం చేసే భారీ స్కామ్ చేపట్టిందని జనసేన నేత నాదెండ్ల మనోహ ఆరోపించారు. బుధవారం నాడు అయన తూర్పు గోదావరి జిల్లా మండపేట లో మీడియతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కనుసన్నల్లో ఈ జిల్లాకు చెందిన వైకాపా నేత డైరెక్షన్లో భారీ కుంభకోణం చేపట్టారని దీన్ని ఆధారాలతో సహా వెల్లడిస్తామని పేర్కొన్నారు. జన సేన ఆధ్వర్యంలో ప్రధానంగా మూడు సమస్య లపై పోరాటం చేసేందుకు అధినేత పవన్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారుల దుస్థితి, నష్ట పోయిన రైతాంగానికి న్యాయం, ఓ టీఎస్ లో నిర్బంధ వసూళు పై తాము పోరాటం సాగిస్తామని అన్నారు. జనసేన రోడ్ లపై పోరాటం చేస్తే గాని అతి గతి లేదన్నారు. సమస్యలపై స్పందించని ఏకైక ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే నని ఎద్దేవా చేశారు. రు13 వేల కోట్ల బడ్జెట్ ఉన్నప్పటికీ కనీసం రోడ్ లు మరమ్మతులు చేయాలేని నిస్సహాయత లో ప్రభుత్వం ఉందని అన్నారు. ఎవరి కోసం ఈ ప్రభుత్వం అంటూ ప్రశ్నించారు. ప్రజల నుండి పన్నులు వసూలు చేసి కనీస రహదారి వంటి వసతులు కూడా కల్పించక పోవడం దురదృష్టమని అన్నారు. బకాయి లు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రావడం లేదని ఇది ప్రభుత్వ దివాళా కోరు తనానికి నిదర్శనం అన్నారు. ఈ జిల్లా కు సంబంధించిన పెద్ద వ్యక్తులు రైతు కు వ్యతిరేకంగా భారీ స్కామ్ చేపట్టి రైతులకు నష్టం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి లాప్ టాప్ తీసుకుని గదిలో కూర్చొని వేల కోట్లు ఖాతాల్లో వేశామని చపట్లు కోరుతున్నారని ఎద్దేవా చేశారు. స్వార్ధం లేకుండా పని చేయాల్సిన ప్రభుత్వం సమస్యలు నుండి పారిపోతున్నారని ఆరోపించారు. జిల్లా లో రూ 200 కోట్లు మరమ్మతులు కు వస్తే వెంటనే ప్రభుత్వం లాగేసుకుందని ఆరోపించారు.

## ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఉద్యోగుల ఆందోళన

విజయవాడ డిసెంబర్ 1ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ నిధులు రూ. 400 కోట్లను ఫైనాన్షియల్ సర్వీసు కార్పొరేషన్‌లోకి మార్చిన వీసీ చర్యను వ్యతిరేకిస్తూ వర్శిటీ ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. యూనివర్శిటీని మరింత అభివృద్ధి చేయాల్సిన అధికారులే దెబ్బ కొడుతున్నారని, నిబంధనలు పట్టించుకోకుండా వీసీ ఏకపక్షంగా రూ. 400 కోట్లు బదలాయించారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. అసలు వీసీకి నిధులు మళ్లించే అధికారం లేదన్నారు. రూ. 400 కోట్ల ద్వారా వచ్చే వడ్డీతో యూనివర్శిటీ కార్యకలాపాలు జరిగేవన్నారు. ప్రతియేటా రూ. 30 కోట్లు ఖర్చు అవుతుంటే... ప్రభుత్వం ఐదు కోట్లు మాత్రమే ఇస్తుందని.. ఇలా అయితే యూనివర్శిటీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కూడా దెబ్బ తింటుందని, నాణ్యమైన విద్య, ప్రాక్టికల్స్‌ను కూడా అందించలేమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలు నిలిచిపోతాయని, ఉద్యోగుల పరిస్థితికి ఇప్పుడు ఎవరు భరోసా ఇస్తారని ప్రశ్నించారు.

# గంజాయి మత్తులో యువకులు

### డ్రైవర్ పై దాడి

విజయవాడ కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం పరిటాల ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఆగి ఉన్న లారీలోకి ముగ్గురు యువకులు ప్రవేశించి డ్రైవర్ ను చితకబాది ఐదు వేలు నగదు, సెల్ ఫోన్ దొంగిలించారు. తనను వదిలేయమని డ్రైవర్ వేడుకుంటున్నా వదలకుండా చేతి కడియం తో ముఖంపై పిడి గుద్దులు గుద్దిడంతో అతడికి గాయాలయ్యాయి. దొంగిలించిన నగదు, సెల్ ఫోన్ తో యువకులు అక్కడి నుండి పారిపోయారు. తరువాత లారీ డ్రైవర్ దగ్గర్లో ఉన్న వాటర్ ప్లాంట్ కి చేరుకుని పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న రెండు గంటల లోపే దోపిడీకి పాల్పడిన యువకులను సిఐ నాగేంద్రకుమార్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం పట్టుకున్నారు. కంచికచర్ల మోడల్ కాలనీ, ప్రణిత కాలనీకి చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ముగ్గురు గతంలో గంజాయి సేవిస్తు పట్టుబడినట్లు సామాచారం. కంచికచర్ల ప్రాంతంలో విచ్చలవిడిగా గంజాయి సేవనానికి అలవాటుపడిన యువకులునేరాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు అంటున్నారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత సెక్షన్ల పై కేసు నమోదు చేసారు.

## నవవధువు ఆత్మహత్య

అనంతపురంనవవధువు సుజన ఆత్మహత్య చేసుకుంది. ఆమె బుక్కరాయసముద్రంలోని గ్రామ సచివాలయం-2లో పనిచేస్తోంది. గత నెల 17న చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు విశ్వనాథ్తో వివాహమైంది. పది రోజుల పాటు సెలవు పెట్టి పుటింట్లో ఉంది. తిరిగి సోమవారం విధులకు హాజరైంది. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చిన సుజన రాత్రి ఇంట్లోని స్నానాల గదిలో ఉరేసుకుని ఆత్మహత్మకు పాల్పడింది. వారం రోజులుగా అత్త వారింటికి ప్రయాణం వాయిదా వేస్తూ వచ్చింది. తల్లిదండ్రులు సర్దిచెప్పి వెళ్లాలని సూచించారు. వారిని వదిలి వెళ్లాల్సి వస్తుందన్న బెంగతో సోమవారం రాత్రి బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించడానికి ప్రయత్నించారు. అప్పటికే మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అనంత గ్రామీణం సీఐ మురళీధర్రెడ్డి వెల్లడించారు.

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్

### దరఖాస్తు చేసుకోండి

### మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కౌతాళం డిసెంబర్ 1 గతంలో పెన్షన్ పొందుతూ సాంకేతిక కారణాల వల్ల తొలగి పోయిన పెన్షన్ దారులు తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నివాసం పాత్రికేయులు సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల్లోని ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో నవశకం రిపోర్టు లో అనర్హులుగా గుర్తించి నిలుపుదలకు గురైన వారు, సచివాలయ పోర్టల్ లో తిరస్కరణకు గురైన వారు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పెన్షన్ కొల్పోయిన వారి తగిన పత్రాలను తీసుకుని ఆయా గ్రామాల్లోని వాలంటరీ లు వారి వివరాలు సేకరించి పెన్షన్ పునరుద్ధరణ కు చర్యలు తీసుకునే విధంగా పని చేయాలని కోరారు.

## పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుని అలంకారంలో శ్రీ పద్మావతి అమ్మవారు

తిరుపతి డిసెంబర్ 1 తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం ఉదయం ఏడు తలలు గల పెద్దశేషవాహనంపై వైకుంఠనాథుని(శ్రీ మహావిష్ణువు) అలంకారంలో



శంకుచక్రాలు, గదతో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. కోవిడ్-19 నేపథ్యంలో ఆలయం వద్దగల వాహన మండపంలో ఉదయం 8 నుండి 9 గంటల వరకు అమ్మవారి వాహనసేవ ఏకాంతంగా జరిగింది. శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో రెండవ వాహనం పెద్దశేషుడు. లక్ష్మీ సహితుడైన శ్రీవారికి దాసుడిగా, సఖుడిగా, శయ్యగా, సింహాసనంగా, ఛత్రంగా సమయోచితంగా సేవలందిస్తాడు. అభయ వరదహస్తయైన శ్రీవారి పట్టమహిషి అలిమేలు మంగకు వాహనమై తన విశేష జ్ఞానబలాలకు తోడైన దాస్యభక్తిని తెలియజేస్తున్నాడు. సర్పరాజైన శేషుని వాహన సేవ దర్శనం వల్ల యోగశక్తి కలుగుతుంది. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టిటిడి బోర్డు సభ్యుడు, చంద్రగిరి ఎమ్మెల్యే డా.చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టిటిడి జెఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో కస్తూరిబాయి, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఏవిఎస్వో వెంకటరమణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ కన్నా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రెండు రోజులపాటు తెలికపాటి వర్షాలు

విశాఖపట్నం డిసెంబర్ 1 మధ్య అండమాన్ సముద్రం, దానికి అనుకొని ఉన్న ప్రాంతాల మీద ఉన్న అల్పపీడనం, దీనికి అను బంధం గా ఉన్న ఉపరితల ఆవర్తనం ,మధ్య ట్రోపో స్పియర్ వరకు విస్తరించిఉన్నది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో ప్రయాణించి రేపు అనగా డిసెంబర్ 2వ తేదీకల్లా వాయుగుండముగా బలపడుతుంది. ఇది మరింత బలపడి తదుపరి 24 గంటలలో మధ్య బంగాళా ఖా తం లో తుపాన్ గా మారుతుంది .ఇది తరువాత వాయువ్య దిశలో ప్రయాణించి మరింత బలపడుతూ ఉత్తరాంధ్ర మరియు దక్షిణ ఒడిస్సా తీరానికి డిసెంబర్ 4వ తేదీకల్లా చేరవచ్చును .వీటి ఫలితంగా ఉత్తర కోస్తా ఆంధ్ర, యానాం ప్రాంతాల్లో గురువారం, శుక్రవారం తేలికపాటినుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకటి లేదా రెండు చోట్లఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది.

# ఎయిడ్స్ కు మందు లేదు నివారణ ఒక్కటే మార్గం

నందికొట్కూర్ (డిసెంబర్:2) ( విభారె) ఎయిడ్స్ వ్యాధికి మందు లేదు. నియంత్రణ ఒక్కటే మార్గమని చైల్డ్ పండు ఇండియా లింక్ వర్కర్ ఎస్ రుబీనా వివరించారు. బుధవారం నాడు నందికొట్కూరు మండలం వడ్డెమాను గ్రామంలో ఎయిడ్స్ నియంత్రణ పై ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ లు ఫండ్ ఇండియా లింక్ వర్కర్క్ స్కీం హెచ్ఐవి ఎయిడ్స్ బీ.టీ ఎస్.టి.ఐ వ్యాధులపై అవగాహన కల్పించారు. వడ్డెమాను జిల్లా పరిషత్ హై స్కూల్ 9 10వ తరగతి ఇ విద్యార్థులు బుధవారం నాడు ఎయిడ్స్ వరల్డ్ డే సందర్భముగా చైల్డ్ పండు ఇండియా లింక్ వర్కర్స్ ఎస్ రుబీన ఈ సందర్భంగా ఎయిడ్స్ చాలా భయంకరమైన వ్యాధి దీనికి కారణమైన హెచ్ఐవి నాలుగు విధాలుగా వ్యాపిస్తుందని ఎయిడ్స్ కు మందు లేదు నివారణ ఒక్కటే మార్గమని. కలుషితమైన సూదులు సిరంజీలు వాడకూడదు. అసురక్షిత లైంగిక సంబంధాలు కలిగి ఉండరాదని ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం హెచ్ఐవి ఎయిడ్స్ టీబీ ఎస్ టి ఐ వ్యాదుపై అవగాహన కల్పించారు. నందికొట్కూరు మండలం వడ్డెమాన్ గ్రామంలోని పరిషత్ ఉన్నత పాఠశాల 9,10, విద్యార్థులు 1/12/2021, బుధవారం ఎయిడ్స్ వరల్డ్ డే ఈ సందర్భంగా చైల్డ్ పండు ఇండియా లింక్ వర్కర్ ఎస్ రుబీనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాధానో ఉపాధ్యాయుల పి. మోహన్ రావు ఉపాధ్యాయులు డి. ఈశ్వరయ్య పీ. రఫీ మహమ్మద్ డి. అలీ హుస్సేన్ పి యస్ భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పపంచ ఎయిడ్స్ దినంని ఘనంగా నిర్వహించిన నంద్యాల రైల్వే హెల్త్ ఇన్స్పెక్టర్

నంద్యాలడిసెంబర్:2) ( విభారె) నంద్యాల రైల్వే స్టేషన్ మరియు రైల్వే కాలనీ నందు ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది , దీని వలన రైల్వే ప్రయానికులకు మరియు రైల్వే కార్మికులకు ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం జరిగింది. హెచ్ఐవి ఎయిడ్స్ మహమ్మారి మీద మనమంతా సమరభేరి మ్రోగిద్దాం , ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపరాదు అని నినాదాలు చేస్తూ ఘనంగా ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో రైల్వే హెల్త్ ఇన్స్పెక్టర్ బోయ రంగస్వామి మరియు ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది.



# డబ్బులు కట్టి శాశ్వత హక్కులు పొందండి



నంద్యాల (డిసెంబర్:2) ( విభారె) :- ప్రభుత్వ పరంగా మంజూరు చేసిన ఇళ్ళకు సంబంధించి లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నంద్యాల మున్సిపల్ పరిధిలో సర్వే నిర్వహించారు . రెండు దశాబ్దాల కిందట నుంచి వివిధ ప్రభుత్వ పథకాల కింద గ్రుహలు పోందిన లబ్ధిదారులకు వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఇళ్ల ను లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయనున్నారు. దీనికి సంబంధించి సచివాలయం ఉద్యోగులు వాలంటీర్లు క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించారు. 1983-నంచి 2011 వరకు గ్రుహనిర్మాణా పథకం లో లబ్ది పొందిన లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పిస్తారు. నంద్యాల నియోజకవర్గంలో గ్రుహ నిర్మాణ శాఖ ఆ జాబితాను ఇప్పటికే సచివాలయం సిబ్బంది కి అందజేసింది. వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల కు వెళ్లి వారు ఏ విభాగం కిందకు వస్తారో గుర్తిస్తారు. విఆర్ఓలు క్షేత్ర స్థాయిలో భౌతిక పరిస్థితిని సమీక్షిస్తారు. సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు కొలతలు హద్దులు నిర్ధారిస్తారు. ఆ వివరాలను డిజిటల్ అసిస్టెంట్లు అంతర్ జాలంలో నమోదు చేస్తారు. ప్రభుత్వం అందించిన మొత్తం యూనిట్ విలువలో లబ్ధిదారులకు కొంత మేర రుణంగా గతం లో అందించారు. రెండు దశాబ్దాలుగా వాటిని వసులు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. లబ్ధిదారులు

### డబ్బులు కట్టనవసరం లేదు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్రీగా రిజిస్ట్రేషన్
### డబ్బులు కట్టాలా వద్దా అనే సందిగ్ధంలో లబ్ధిదారులు

గ్రహాలు నిర్మించుకున్నా రుణాలు చెల్లించని వారి పైనే దృష్టి సారించి వన్ టైమ్ సెటిల్ మెంట్ చేయాలని నిర్ణయించింది. లబ్ధిదారులను నాలుగు విభాగాలు విభజించారు పట్టా పొంది పది సంవత్సరాలు పూర్తి అయి ఉండాలి. 1) పట్టాదారుడు బుణం తీసుకుని నిర్మాణం చేసి ఉంటే (ఎ) గా గుర్తిస్తారు. ఇందులో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక్కో లబ్ధిదారుడు 10 వేలు. పట్టణ ప్రాంతానికి చెందిన వారు 15 వేలు. కార్పోరేషన్ వారు 20 వేలు చెల్లించాలి. (2)పట్టా భూమి కొనుగోలు చేసి నివసించే వారిని (బి) లో చేర్చారు. అనుభవ దారుడు గ్రామాల్లో అయితే 20 వేలు. పట్టణంలో అయితే 30 వేలు. కార్పోరేషన్ లో అయితే 40 వేలు చెల్లించాల్సి ఉంటుంది. (3) గతంలో పట్టాపొందిన వారసులు ఉంటే వారిని (సి) బాగంలో చేర్చారు. ఇలాంటి వారు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. (4) అభ్యంతర కరంగా కాని ఫోరం భోకు తదితర ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి వద్ద కూడా 15 వేలు వసూలు చేసి రెగ్యులర్ చేయనున్నారు. కానీ ఈ మధ్య కాలంలో తెలుగు దేశం పార్టీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఫ్రిగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని ఏవరు కూడా ఒక్క రూపాయి కూడా డబ్బులు కట్టనవసరం లేదని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయం విన్న లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. డబ్బులు కట్టాలా వద్ద అని సందిగ్ధంలో లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు.

## తెదేపా అధికారంలోకి వస్తే ఉచితంగా ప్రభుత్వ ఇళ్లకు రిజిస్ట్రేషన్.. టిఎన్ ఎస్ఎఫ్ మాదిగ నాగరాజు

ఎమ్మిగనూరు(డిసెంబర్:2) ( విభారె) పట్టణంలో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ,ఎన్టీఆర్ ఇండ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని టిఎన్ఎస్ఎఫ్ మాదిగ నాగరాజు, రంజిత్, రామా నాయుడు, సురేంద్ర రెడ్డి అన్నారు. మాజీ ఎంఎల్ ఏ డా. బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లకు రిజిస్ట్రేషన్ కు రూ.10 నుండి రూ. 20 వేల దాక వసూలు చేస్తున్నారని పేద ప్రజలు పంటలు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే సీఎం జగన్ డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు.

## ఎం పి పి స్కూల్ గార్లదిన్నె భవన నిర్మాణాలు తక్షణమే చేపట్టాలి

### విద్యార్థులు యువకుల ఆధ్వర్యంలో ధర్నా



ఎమ్మిగనూరు (డిసెంబర్:2) ( విభారె) మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో ప్రభుత్వ పాఠశాల నందు గతంలో నిర్మించిన అటువంటి భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి కిందకి పడటం జరుగుతుంది. అంతేకాకుండా వర్షం వస్త స్కూలు చిత్తడి చిత్తడిగా వర్షపు నీరు కిందికి పడడం వలన విద్యార్థులకు కూర్చోవడానికి కూడా స్థలం లేనటువంటి పరిస్థితి ఉండడం జరుగుతుంది. నిన్నటి రోజున స్కూల్ హెచ్ఎం ( కె శ్రీనివాసులు గారు ) టీచర్ మాధవరావు గారు టాప్ పైన ఉన్నటువంటి చెత్త, నీరు తొలగించడానికి వెళ్లి స్కూల్ బిల్డింగ్ మీద నుండి వెళ్ళిన టువంటి లెవెన్ కె.వి విద్యుత్ వైరు తాకి హెచ్ ఎం శ్రీనివాసులు గారు భవనం మీద నుండి క్రిందపడి గాయాల పాలవడం జరిగింది. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అధికారులు గాయపడిన హెచ్ ఎం శ్రీనివాస్ సార్ వైద్యానికి సరిపడా ఆర్థిక సహాయాన్ని అందించాలని అదేవిధంగా ప్రభుత్వము విద్యాశాఖ అధికారులు నాడు నేడు పనుల కింద స్కూల్ భవనాన్ని తక్షణమే పునర్ నిర్మాణం చేపట్టాలని బిల్డింగ్ మీద ఉన్న లెవెన్ కె.వి వైర్ ను విద్యుత్ శాఖ అధికారులు తొలగించాలని గ్రామ విద్యార్థులు యువకులు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో తిమ్మ గురుడు, రఘునాథ్, రవి, మైసూర్ రెడ్డి, నరసింహ, దస్తగిరి, యువరాజ్, కృష్ణ, కె లక్ష్మన్న, విజయ్ కుమార్,నల్లన్న, ఖాజావలి, చిన్న రాముడు, పి అనిల్, బి తేజ, ఈరన్న,, హుస్సేన్, మహేష్, రామాంజనేయులు, అలీ భాష, బి శేఖర్, కేసన్న, తిప్పమ్మ, ఎస్ వీరేష్, బి చిన్న రంగన్న, బి సురేష్, ఎస్ రంగన్న, అంజి, విద్యార్థులు, యువకులు పాల్గొనడం జరిగింది

## ఆసుపత్రిలో అవినీతి తాండ విస్తోంది పట్టించుకునే నాథుడే లేడు

నంద్యాల (డిసెంబర్:2) ( విభారె)జిల్లా ఆసుపత్రిగా పేరుగాంచిన నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి లో అవినీతికి అంతం లేకుండా పోతోందని పలువురు విమర్శిస్తున్నారు . ముఖ్యంగా సిటీ స్కానింగ్ సరసమైన ధరలకే ప్రభుత్వం ఆసుపత్రిలో సిటీ స్కానింగ్ సెంటర్ ను ఓ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారు. ప్రైవేటు వ్యక్తులు ఇష్టం వచ్చినట్లు స్కానింగ్ కు మూడు వేల రూపాయలు నుండి ఆరువేల రూపాయలు వరకు పేషెంట్స్ దగ్గర గుంజుతున్నారనేది ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయం . పేద ప్రజలను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని డబ్బులు ఇవ్వనిదే స్కానింగ్ తీయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు . ఇంత అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నా ఆసుపత్రి సూపరింటెండెంట్ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు

# ఐటమ్ సాంగ్ లో సమంత హాట్ హాట్ స్టెప్పులు..!

అల్లు అర్జున్ నటిస్తున్న ఫస్ట్ పాన్ ఇండియా మూవీ "పుష్ప". ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబరు 17న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శరవేగంగా ప్రమోషన్స్ చేస్తున్న చిత్ర బృందం.. చివరి పాట చిత్రీకరణలో బిజీగా వుంది.'పుష్ప: ది రైజ్' సినిమాలో స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ఓ స్పెషల్ సాంగ్ చేయనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లో ఈ ఐటమ్ సాంగ్ షూటింగ్ జరుగుతోంది. రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ స్వరపరిచిన ఈ స్పెషల్ నంబర్ లో బన్నీ - సామ్ స్టెప్పులు ప్రత్యేకంగా నిలుస్తాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య ఈ పాటకు డ్యాన్స్ కంపోజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా 'పుష్ప' మేకర్స్ సమంత చేస్తున్న ప్రత్యేక గీతానికి సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - సమంత రూత్ ప్రభు కలసి చేస్తున్న రాకింగ్ నంబర్ ను భారీ సెట్ లో చిత్రీకరిస్తున్నామని తెలిపారు. త్వరలో ఈ 'సిజ్లింగ్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' ని చూడటానికి సిద్ధంగా ఉండండని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్ ని రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. ఇందులో సమంత ఫేస్ కనిపించనప్పటికీ.. నడుము మీద చెయ్యేసి వయ్యారాలు పోతున్న పోజ్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ సిజ్లింగ్ పోస్టర్ చూసి సినిమాలో ఐటమ్ సాంగ్ ఎలా ఉంటుందో ఓ అంచనాకు వస్తున్నారు. అసలే పుష్పరాజ్ ఊర మాస్. ఇప్పుడు ఆయనకు ఏమాత్రం తగ్గినంటూ సామ్ జత కలుస్తోంది. 'సన్నాఫ్ సత్యమూర్తి' సినిమాలో అల్లు అర్జున్ సరసన హీరోయిన్ గా నటించిన సామ్.. ఇప్పుడు 'పుష్ప: ది రైజ్' లో స్పెషల్ నంబర్ లో ఎలా ఆడిపాడుతుందో చూడాలి. కాగా 'పుష్ప' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ - ముత్యంశెట్టి మీడియా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు హిందీ తమిళ మలయాళ కన్నడ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్న చిత్రమిది. ఇందులో బన్నీకి జోడిగా రష్మిక మందన్నా నటిస్తోంది. ఫహాద్ ఫాజిల్ - సునీల్ - అనసూయ - ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ - సాంగ్స్ మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. డిసెంబరు 6న 'పుష్ప: ది రైజ్' ట్రైలర్ విడుదల కానుంది.




# 'ఆచార్య' లో చిరు-చిరుత పాత్రల గురించి కొరటాల చెప్పిన విశేషాలు..!

మెగాస్టార్ చిరంజీవి రామ్ చరణ్ హీరోలుగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ "ఆచార్య". కొణిదెల ప్రొడక్షన్స్ సమర్పణలో మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్ పై రూపొందుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 4న విడుదల చేయనున్నారు. ఇందులో ఆచార్యగా చిరు.. సిద్ధగా చరణ్ కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు - టీజర్ - సాంగ్స్ మంచి స్పందన తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో ఇటీవల 'సిద్ధా సాగా' పేరుతో వచ్చిన చెర్రీ క్యారెక్టర్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. ఇందులో కామ్రేడ్ సిద్ధగా రామ్ చరణ్ ఒదిగిపోయిన విధానం.. గెటప్ - నటన అందరినీ ఆకట్టుకున్నాయి. 'ధర్మస్థలికి ఆపదొస్తే.. అది జయించడానికి అమ్మోరుతల్లి మాలో ఆవహించి ముందుకు పంపుతుంది' అని చెర్రీ చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్ తో చప్పట్లు కొట్టిస్తోంది. ముఖ్యంగా ఈ టీజర్ లోని చివరి షాట్ మెగా అభిమానులకు గూస్ బంప్స్ తెప్పిస్తోందని చెప్పాలి. సెలయేరుకు ఒకవైపు చిరుత పిల్ల నీరు తాగుతుంటే.. దాని వెనుక తల్లి చిరుత కాపలా కాస్తూ చూస్తుంటుంది. మరోవైపు చిరు తనయుడు చరణ్ నీళ్లు తాగుతుండగా.. వెనుక చిరు కాపాలా కాసే షాట్ అదరగొట్టేసింది. ప్రస్తుతం సిద్ధ టీజర్ యూట్యూబ్ లో రికార్డు వ్యూస్ తో ట్రెండింగ్ లో కొనసాగుతోంది. చిరంజీవి - రామ్ చరణ్ లను ఒకే ఫ్రేమ్ లో చూసిన మెగా ఫ్యాన్స్.. దర్శకుడు కొరటాల శివ ను ఆకాశానికి ఎత్తుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో కొరటాల మాట్లాడుతూ.. సిద్ధ టీజర్ కు వస్తున్న రెస్పాన్స్ కు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. "ఆచార్య సినిమా ధర్మం గురించి చెబుతుంది.. ధర్మస్థలి చుట్టూ తిరిగే కథ ఇది. రామ్ చరణ్ పోసించిన సిద్ధ పాత్ర ధర్మానికి ప్రతిరూపం. సీన్స్ ఆర్గానిక్ గా రావడానికి టీమ్ మొత్తం చేసిన కృషే కారణం" అని చెప్పారు. సిద్ధ టీజర్ లో చివరి షాట్ గురించి మాట్లాడుతూ.. 'ఆచార్య' లో రామ్ చరణ్ కు సంబంధించి సన్నివేశాలు ఆర్గానిక్ గా ఉంటాయని.. అలాంటి సీన్స్ లో అదొకటని కొరటాల శివ తెలిపారు. "సినిమాలో అది చాలా అందమైన షాట్. వాళ్ళిద్దరికే కరెక్ట్ గా సెట్ అవుతుంది. లక్కీగా ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ ఫేస్ ఉండటం.. ఆర్గానిక్ గా ఆ షాట్ ఉండటం కలిసొచ్చింది. ఫ్యాన్స్ అది చూసి ఎలా ఫీల్ అవుతున్నారో నేను ఊహించగలను. ఆ షాట్ తీసేటప్పుడు చాలా హై వచ్చింది. దీనికి మంచి రెస్పాన్స్ వస్తుందని అనుకున్నాం. అయితే టీజర్ వచ్చాక అది నెక్ట్స్ లెవెల్ కు వెళ్ళింది" అని కొరటాల అన్నారు. తాను చెప్పాలనుకున్న ఐడియాతో పాటుగా.. మెగాస్టార్ ఇమేజ్ దృష్టిలో పెట్టుకొని.. ఫ్యాన్స్ ఏమి ఎక్స్పెక్ట్ చేస్తారో అన్ని అంశాలు ఉండేలా 'ఆచార్య' కథ రాసానని కొరటాల తెలిపారు. దీనికి బోనస్ గా దొరికిన ప్రసాదం రామ్ చరణ్ అని.. చాలా పవర్ ఫుల్ గా ఆలోచనా శక్తి కలిగిన యువకుడిగా హానెస్ట్ సిద్ధ కనిపిస్తాడని వెల్లడించారు. చిరంజీవి - రామ్ చరణ్ తొలిసారి కలిసి చేస్తున్న సినిమా ఇదని.. మళ్ళీ ఇలాంటి అవకాశం వస్తుందో లేదో తెలియదని.. అందుకే కథ బాగా వచ్చినా వాళ్ళిద్దరినీ ఒకే ఫ్రేమ్ లో చూపించడానికి కాస్త టెన్షన్ పడ్డానని కొరటాల తెలిపారు. రాబోయే రోజుల్లో రెండు పెద్ద విశేషాలు ఉంటాయని.. ఒకటి చిరంజీవి-చరణ్ కలిసి చేసిన పాట అయితే మరొకటి థియేట్రికల్ ట్రైలర్ అని చెప్పారు.



# రిలీజ్ కు రెడీ అయిన 'సెహరి'



హర్ష కనుమల్లి - సిమ్రాన్ చౌదరి హీరో హీరోయిన్లుగా రూపొందిన న్యూ ఏజ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ "సెహరి". జ్ఞాన సాగర్ ద్వారక ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విర్గో పిక్చర్స్ బ్యానర్ పై అద్వయ జిష్ణు రెడ్డి - శిల్పా చౌదరి సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తున్నారు. నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా విడుదలైన ఫస్ట్ లుక్ ఈ చిత్రానికి కావాల్సినంత పబ్లిసిటీ తెచ్చిపెట్టింది. ఈ క్రమంలో వచ్చిన టీజర్ - సాంగ్స్ మంచి స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా 'సెహరి' టైటిల్ సాంగ్ - 'ఇది చాలా బాగుందిలే' పాటలు సోషల్ మీడియాలో యువతను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సిద్ శ్రీరామ్ ఆలపించిన "ఇది చాలా బాగుందిలే" పాట 80 లక్షలకు పైగా వ్యూస్ తో శరవేగంగా కోటి వీక్షణలకు దూసుకుపోతోంది. ఇక 'సెహరి' టీజర్ కు యూట్యూబ్ లో ఇప్పటి వరకు 60 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ప్రమోషనల్ కంటెంట్ తో ప్రేక్షకులలో ఆసక్తిని కలిగించిన ఈ సినిమా అతి త్వరలో విడుదల కాబోతోందని మేకర్స్ ప్రకటించారు. నిర్మాత అద్వయ జిష్ణు రెడ్డి మాట్లాడుతూ.. 'సెహరి' టీజర్ మరియు పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా హీరో హర్ష కనుమిల్లి నటన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. ఎక్కడ కూడా మొదటి సారిగా నటించినట్టుగా కాకుండా ఎంతో అనుభవం ఉన్న నటుడిగా చాలా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఉన్నత నిర్మాణ విలువలతో నిర్మించబడిన "సెహరి" సినిమా కుటుంబ సమేతంగా వెళ్ళి హాయిగా నవ్వుకుని ఆనందించదగ్గ సినిమా అవుతుంది అని చిత్ర విజయం పట్ల ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక మాట్లాడుతూ.. 'సెహరి' చిత్రంలోని కథ మరియు పాత్రలన్నీ యువతతో పాటుగా కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఇకపోతే 'సెహరి' చిత్రానికి హీరో హర్ష కనుమల్లి కథ అందించడం విశేషం. ప్రశాంత్ ఆర్ విహారీ సంగీతం సమకూర్చారు. అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ అందించగా.. రవితేజ గిరజాల ఎడిటింగ్ వర్క్ చేశారు. సాహి సురేష్ ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరించారు. ప్రముఖ సంగీత దర్శకుడు కోటి ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. అభినవ్ గోమఠం - ప్రణీత్ రెడ్డి - అనిషా అల్లా - అక్షిత హరీష్ - బాలకృష్ణ తదితరులు ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. 'సెహరి' విడుదల తేదీని మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.

# వెంకటేశ్ అయ్యరా మజాకా.. అప్పుడు 20 లక్షలు.. ఇప్పుడు 8 కోట్లు.. ఏకంగా 4000 శాతం హైక్!



ఒక్కసారి క్యాష్ రిచ్ లీగ్ ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోతే చాలు మినిమమ్ లక్షాధికారి అయిపోవచ్చు. అదే.. ఆడే అవకాశం రావడం.. అందునా ప్రతీ మ్యాచ్ లో అద్భుతంగా రాణిస్తే ఇంక చెప్పేదేముంటుంది. కోట్లు కొల్లగొట్టేయచ్చు. ప్రతిభను నిరూపించుకుంటే చాలు కోట్లాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసేందుకు ఫ్రాంఛైజీలు ఎగబడతాయి. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన ఎంతో మంది క్రికెటర్లు ఈ లీగ్ ద్వారా ధనవంతులైపోయారు. ఐపీఎల్ మెగా వేలం-2022 నేపథ్యంలో వెంకటేష్ అయ్యర్‌ను రిటెన్షన్ కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్ వెచ్చించిన మొత్తమే ఈ ప్రస్తావనకు కారణం. వెంకటేశ్ అయ్యర్‌ను కేవలం 20 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది కేకేఆర్. అయితే, ఐపీఎల్-2021లో భాగంగా యూఏఈ వేదికగా సాగిన రెండో అంచెలో అతడు అత్యద్భుతంగా రాణించడంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. 10 ఇన్నింగ్స్ ఆడిన ఈ స్టార్ ఓపెనర్ 370 పరుగులు చేశాడు. జట్టు ఫైనల్ చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఈ క్రమంలో అతడిని రిటైన్ చేసుకునేందుకు నిర్ణయించుకున్న ఫ్రాంఛైజీ.. ఏకంగా 8 కోట్లు ఖర్చు చేసింది. దీంతో వెంకటేశ్ అయ్యర్ సాలరీ దాదాపు 40 రెట్లు(4000%) పెరిగింది. ఈ నేపథ్యంలో ఒకవేళ అయ్యర్ గనుక వేలంలోకి వస్తే రికార్డులు బద్దలయ్యేవి అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కాగా వెంకటేశ్ ఇటీవలి న్యూజిలాండ్ సిరీస్‌తో టీమిండియా తరఫున అంతర్జాతీయ టీ20లలో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాను ఆల్‌రౌండర్‌ను అని, జట్టు ప్రయోజనాల దృష్ట్యా ఏ స్థానంలో ఆడేందు?కైనా సిద్ధంగా ఉంటానని చెప్పుకొచ్చాడు. ఇక ఐపీఎల్ రిటెన్షన్ విషయానికొస్తే.. కేకేఆర్ ఆండ్రీ రసెల్ (రూ. 12 కోట్లు), వరుణ్ చక్రవర్తి (రూ. 8 కోట్లు), వెంకటేశ్ అయ్యర్ (రూ. 8 కోట్లు), సునీల్ నరైన్ (రూ. 6 కోట్లు)ను కొనసాగిస్తామని ప్రకటించింది. ఇందుకోసం 42 కోట్లు ఖర్చు చేయగా.. కోల్‌కతా పర్సులో ఇంకా 48 కోట్ల రూపాయలు ఉన్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190